క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



పెదపట్నంలంక ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన విగ్రహాలు

మామిడికుదురు: పెదపట్నంలంక దేవి సెంటర్‌లో కొలువుదీరిన కోదండరామస్వామి వారి ఆలయంలో పాల శిలా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్తరాషాఢ నక్షత్ర యుక్త వృషభ లగ్నం 9.14 గంటలకు వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ పాల శిలా విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించారు. దీనిలో భాగంగా పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్యాల వీవీ లక్ష్మీసత్యనారాయణ–శ్రీదేవి, ముత్యాల అమ్మిరాజు–కుమారి, ముత్యాల దుర్గాప్రసాద్–ఉషాదేవి దంపతులు ప్రధాన కర్తలు పాల్గొన్నారు. విష్వక్సేన పూజ, పుణ్యాహ వాచనం, రత్నన్యాసం, పూర్ణాహుతి, గోదృష్టి, శాంతి కల్యాణం, ఆశీర్వచనం, పండిత సత్కారం తదితర కార్యక్రమాలను ఘనంగా జరిపించారు. దీనిలో భాగంగా ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

చెక్‌పోస్టు వద్ద తనిఖీలు సక్రమంగా నిర్వహించాలి



జొన్నాడలోని చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్న ఆర్డీఓ జీవీవీ

ఆలమూరు: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా జొన్నాడలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీలు సక్రమంగా నిర్వహించాలని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక పోలీసు అవుట్ పోస్టు వద్ద నెలకొల్పిన చెక్‌పోస్టును బుధవారం ఆయన పరిశీలించారు. ప్రత్యేక అధికారి ఎం.పోశమ్మకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించాలన్నారు. ఏ విధమైన సమస్యలు తలెత్తినా సత్వరమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, ఆర్‌ఐ ఎం.జానకి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

వెండి గంగాళం సమర్పణ



ఆలయంలో అర్చకుడుకి వెండి గంగాళం ఇస్తున్న దాతలు

మలికిపురం: స్థానిక వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామికి దాతలు 540 గ్రాముల బరువైన వెండి గంగాళం బుధవారం సమర్పించారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త ఉయ్యూరు హరిప్రసాద్ రాజుకు, అర్చకుడు కిలాంబి వెంకట కృష్ణమాచార్యులకు ఈ వెండి గంగాళంను దాతలు రాజా బసవకుమార్ బ్రదర్స్ అందజేశారు.

ఎమ్మెల్సీ పరామర్శ

మామిడికుదురు: ప్రమాదవశాత్తూ రెండు కాళ్లు తెగి వైద్య చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న గోగన్నమఠం గ్రామ చివారు ముత్యాలపాలానికి చెందిన ఎమ్మార్పీఎస్ నేత ముస్కూడి సన్యాసిరావు (పండు)ను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ బుధవారం పరామర్శించారు. అతని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ వెంట ఎమ్మార్పీఎస్ నేతలు ఉన్నారు.

విశ్వాంతర్యామి శ్రీకృష్ణుడు

అయినవిల్లి: శ్రీకృష్ణుడు విశ్వాంతర్యామి అని అన్నీ ఆయనకు తెలుసని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాసదాసు ప్రభుజీ అన్నారు. బుధవారం మందిర్ నిర్మాణంలో భాగంగా 9.14 గంటలకు భక్తుల ఆధ్వర్యంలో గుమ్మం ముహూర్తం చేశారు. శ్రీనివాసదాసు ప్రభుజీ ప్రవచిస్తూ.. మనుషుల మనస్తత్వాన్ని బట్టి వర్ణాలను భగవంతునితో నిర్ణయించబడిందన్నారు. అసలు భగవంతుడు చాతుర్వర్ణాలను సృష్టించాడన్నారు. ఇందులో ఎవరూ ఎక్కువ కాదు, ఎవరూ తక్కువ కాదు అన్నారు. భగవంతుని దృష్టిలో అందరూ సమానమే అన్నారు. అనంతరం భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మందిర నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాత కుటుంబ సభ్యులు, నిర్మాణానికి సహకరించిన దాతలు, పలువురు భక్తులు, సేవకులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల ఎస్ఎస్ఎస్ విభాగం, ప్రభుత్వ ఆసుపత్రి సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 20 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సరైన సమయంలో రక్తదానం చేసి అవసరమైన వారి జీవితాల్లో వెలుగును ప్రసాదించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల నెరవేరుతున్న వేళ

- రూ.1.01 కోట్లతో వంతెన నిర్మాణం
- శిథిల కాజ్‌వే తొలగింపు



శిథిలస్థితికి చేరిన కాజ్‌వే తొలగింపు



డ్రైన్‌లో ఏర్పాటు చేసిన క్రాస్‌బండ్

మామిడికుదురు: మూడు వేల ఎకరాల్లోని ముంపు నీరు గోదావరి నదిలోకి పారుదల అయ్యే వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన కాజ్‌వే శిథిలస్థితికి చేరింది. దాని స్థానే నూతన కట్టడం నిర్మించాలని రైతులు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నా ఫలితం శూన్యం. ఎట్టకేలకు రైతుల కల ఫలించింది. తాజా కట్టడానికి నిధులు మంజూరు చేశారు. దీంతో కాజ్‌వే స్థానే పక్కా వంతెన నిర్మాణానికి కార్యాచరణ మొదలు పెట్టారు. పాశర్లపూడిలంక–లూటుకుర్రు గ్రామాల సరిహద్దులోని వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై సుమారు 60 ఏళ్ల క్రితం కాజ్‌వే నిర్మించారు. ఈ కాజ్‌వే చాలా కాలం క్రితం శిథిల స్థితికి చేరింది. అప్పట్లో మరమ్మతులతో కాజ్‌వేను చక్కదిద్దారు. ఇటీవల కాలంలో కాజ్‌వే పూర్తిగా కుంగి దిగబడిపోయింది. దీనిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

కలెక్టర్ చొరవతో నిధులు..

కాజ్‌వే స్థానే వంతెన నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేయడంతో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా డీఎంఎఫ్ ద్వారా రూ.41.60 లక్షలు మంజూరు చేశారు. అమలాపురం ఎంపీ చింతా అనురాధ ఎంపీ ఫండ్స్ నుంచి రూ.25 లక్షలు, జిల్లా పరిషత్ ద్వారా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు రూ.35 లక్షలు వెరసి వంతెన నిర్మాణానికి రూ.1.01 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో వంతెన నిర్మాణం చేపట్టారు. శిథిలస్థితికి చేరిన కాజ్‌వేను తొలగించి దాని స్థానే నూతన కట్టడం నిర్మిస్తున్నారు. కాజ్‌వేకు రెండు వైపులా క్రాస్ బండ్లు ఏర్పాటు చేశారు. ఒక వైపు నుంచి ద్విచక్ర వాహనాలు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కాజ్‌వే తొలగింపు, క్రాస్‌బండ్ల ఏర్పాటు పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు.

సుదీర్ఘకాలం తరువాత మోక్షం



ఎంతో కాలం నుంచి అధ్వానంగా ఉన్న కాజ్‌కు సుదీర్ఘ కాలం తరువాత మోక్షం లభించడం ఎంతో ఆనందంగా ఉంది. కాజ్‌వే పాడైపోవడంతో ముంపు నీరు సక్రమంగా పారుదల కాక చాలా కాలంగా రైతులు ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు. వంతెన నిర్మాణంతో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఆలస్యమైన పక్కా వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టడం సంతోషంగా ఉంది. వేలాది మంది రైతులకు ఈ వంతెన ఎంతో ఉపయోగపడుతుంది.

– కళిరెడ్డి రమణ, లూటుకుర్రు

కష్టాలు తీరతాయి



పాశర్లపూడిలంక–ఆదుర్రు రోడ్డు ఇటీవల ఆధునీకరణకు నోచుకుంది. దీన్ని పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. పూర్వం నిర్మించిన కాజ్‌వే మాత్రం అభివృద్ధి చెందలేదన్న బాధ ఇంత కాలం ఉండేది. కానీ ఎట్టకేలకు కలెక్టర్, ప్రజా ప్రతినిధుల చొరవతో కాజ్‌వేకు మోక్షం కలిగింది. ఇక్కడ వంతెన నిర్మించడం ముదావహం. దీనిని ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నారు. త్వరగా వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

– అడబాల వెంకటేశ్వరరావు, లూటుకుర్రు

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



పెదపళ్లలో చిన్నారులకు టీకాలు అందజేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు అందజేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకష్ణ, కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, ఎంపీహెచ్ఈఓ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు.గర్భిణులకు ఇంజక్షన్లు వేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పీసీవీ, పెంటావాలెంట్, ఎంఆర్, హైపటైటిస్–బీ వ్యాక్సిన్లను అందజేశారు.

బీసీలకు పెద్దపీట వేసింది జగనే



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అంబాజీపేట: రాష్ట్రంలో బీసీలకు సామాజిక న్యాయం చేసి, రాజ్యాధికారం ఇచ్చిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, పి.గన్నవరం నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు అన్నారు. పసుపల్లిలో శ్రీనివాసరావు బుధవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు బీసీ డిక్లరేషన్ అంతా ఎన్నికల బూటకమేనని, 14 ఏళ్ల పాలనలో ఆయన బీసీలకు చేసిందేమి లేదన్నారు. బీసీ డిక్లరేషన్ పేరిట ఆయన ఇచ్చిన వాగ్దానాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేరన్నారు. బీసీ అంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు, బ్యాక్ బోన్ క్యాస్ అని సీఎం జగన్ అన్నింటా బీసీలకు అగ్రతాంబూలం ఇచ్చారన్నారు. ఐదేళ్లలో సీఎం జగన్ నలుగురు బీసీ నాయకులను రాజ్యసభకు పంపిస్తే 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు ఒక్కరిని పంపలేదన్నారు. జగన్ క్యాబినెట్‌లో 11 మందికి మంత్రి పదవులిచ్చారన్నారు. శాసన మండలిలో 29 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులకు ఎమ్మెల్సీలుగా వైఎస్సార్ సీపీ అవకాశం ఇచ్చిందన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే బీసీలకు నిజమైన మేలు జరిగిందన్నారు. చంద్రబాబు ప్రతి ఎన్నికల్లో ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేయడం అయనకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. బీసీలంతా వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఇచ్చే పింఛన్ పంపిణీ కేవలం చంద్రబాబు వల్లే నిలిచిపోయిందన్న విషయం ప్రతి ఒక్కరికీ తెలిసిందన్నారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు, అమలాపురం ఎంపీ రాపాక వరప్రసాద్ రావులను గెలిపించాలని కోరారు. శ్రీనివాసరావు వెంట ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, వాసంశెట్టి పెదబాబు, వాసంశెట్టి తాతాజీ, అంబటి శ్రీనివాస్, వెన్నపు రాంబాబు తదితరులు ఉన్నారు.

పథకాలు చూడండి... ఓటేసి గెలిపించండి



వక్కలంకలో ఓటర్లకు పాంప్లెట్లను అందిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు, డీసీసీబీ చైర్మన్ వీర్రాజు

అంబాజీపేట: ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకున్న ఒకే ఒక్క వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. పసుపల్లి, వక్కలంక, కముజువారిలంక గ్రామాల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు. మహిళలు అడుగడుగునా హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ చెప్పాడంటే చేస్తాడంతే అనే నానుడితో జగన్ పేరే ఒక నమ్మకంగా ప్రజల్లో బలంగా నాటుకుపోయిందని స్పష్టం చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, అమలాపురం పార్లమెంట్ అభ్యర్థిగా రాపాక వరప్రసాద్‌లకు రెండు చోట్ల ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి మమ్మల్ని గెలిపిస్తే మళ్లీ మీ జగనన్న ముఖ్యమంత్రిగా మీకు మంచి చేస్తారన్నారు. బడుగు బలహీన వర్గాలను ఎదగనీయకుండా అణగదొక్కడమే చంద్రబాబు జీవిత ఆశయంగా పెట్టుకున్నాడన్నారు. అధికార మదంతో అప్పుడు, ప్రతిపక్ష హోదాతో నేడు దళితులు, బీసీ వర్గాలపై నోరు పారేసుకునే అగ్రకుల అహంకారి చంద్రబాబు అన్నారు. వలంటీర్లపై కక్ష సాధించి ప్రతి నెలా ఒకటో తేదీన ఇచ్చే పింఛన్ పంపిణీకి చంద్రబాబు అండ్‌కో అడ్డుకున్నారన్నారు. పొత్తుతో వస్తున్న మోసగాళ్లను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, నేలపూడి స్టాలిన్‌బాబులు మాట్లాడుతూ సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని అందుకు మీరంతా జగనన్నతో పాటు తమను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, సర్పంచ్‌లు మట్టపర్తి నాగరాజు, వాసంశెట్టి రేవతి, వాసంశెట్టి పెదబాబు, కొర్లపాటి కోటబాబు, నాగవరపు నాగరాజు, ముత్తాబత్తుల మణిరత్నం, జనుపల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ

మలికిపురం: మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలు రాసిన అందరి విద్యార్థులకు ఉచిత పాలిటెక్నిక్, ఏపీఆర్జేఈసీ శిక్షణ కోసం స్థానిక విశ్వేశ్వరాయపురం పాఠశాలలో శిబిరం ఏర్పాటు చేశారు. సంఘం స్టడీ మెటీరియల్ కూడా సమకూరుస్తుండగా గ్రామానికి చెందిన సూర్యచంద్ర చారిటబుల్ ట్రస్టు అధినేత వాసు సాయిరామ్ ఈ శిక్షణ కార్యక్రమానికి విచ్చేసి విద్యార్థులకు పాలిటెక్నిక్ ఆన్‌లైన్ ఎంట్రన్స్ ఫీజు చెల్లిస్తామని ప్రకటించారు. ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు వారి పాఠశాలల్లో విద్యార్థులకు మరోసారి తెలియపరిచి ఈ అవకాశం సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని మలికిపురం మండల బీసీ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కంకటాల చంద్రశేఖర్ కోరారు. శిక్షణ అన్ని పరీక్షలకు ఉపయోగపడుతుందన్నారు. ప్రధాన కార్యదర్శి జేపీ, గౌరవ అధ్యక్షుడు గుబ్బల సింహాచలం, ముఖ్య సలహాదారు నాత్ర ఉమామహేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శి కొప్పాడి శ్రీను, కటకం రవి, దొంగ శివకృష్ణ, పెచ్చెట్టి కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కలలు సాకారం చేసిన సీఎం



మోరి కన్వెన్షన్ హాల్‌లో వైఎస్సార్ సీపీలో చేరిన యూత్ నాయకులతో గొల్లపల్లి

సఖినేటిపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్న కలలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని వైఎస్సార్ సీపీ రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మంగళవారం రాత్రి మోరి వీ కన్వెన్షన్ హాల్‌లో గొల్లపల్లి సమక్షంలో టీడీపీకి చెందిన యూత్ నాయకుడు ఓగూరి అక్రోష్ కుమార్, మోరి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఓగూరి రాజ్యలక్ష్మి చేరారు. అలాగే అక్రోష్ కుమార్ సారథ్యంలో మోరి వంతెన వద్ద ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు, ఇతర ప్రాంతాలకు చెందిన పలు యూత్ అసోసియేషన్ల సభ్యులు కూడా అధిక సంఖ్యలో పార్టీలో చేరారు. వీరందరికీ గొల్లపల్లి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మహిమ కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ ఓగూరి టాండన్‌రాజు అధ్యక్షతన జరిగిన వైఎస్సార్ సీపీ విస్తృత సమావేశంలో గొల్లపల్లి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, డాక్టర్ అంబేడ్కర్ ఆలోచనా విధానానికి అనుగుణంగా సీఎం జగన్ విద్యారంగంలో నాడు–నేడుతో పాటు అనేక పాలనా సంస్కరణలు తెచ్చారన్నారు. అలాగే సామాజిక సమతూకానికి పెద్దపీట వేస్తూ, సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న ఏకైక సీఎం జగన్ అని అన్నారు. అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావును, రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఫ్యాన్ గుర్తులపై ఓట్లు వేసి గెలిపించి, సీఎం జగన్‌కు కానుకగా ఇవ్వాలని గొల్లపల్లి కోరారు. కార్యక్రమంలో నేలపూడి స్టాలిన్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, నెడ్ క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, చేనేత నాయకుడు జాన శంకరరావు, సర్పంచ్‌లు పసలపూడి లక్ష్మీపద్మ, మంగతాయారు, గొల్లమందల చిట్టిబాబు, ఎంపీటీసీలు జాన లక్ష్మీదుర్గ సూర్యావతి, కొల్లాబత్తుల శుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



ఓటర్లను చైతన్యం చేసేందుకు నిర్వహించిన ర్యాలీలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తపేట: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. భారతీయ ఎన్నికల సంఘం ద్వారా క్రమబద్ధకరమైన ఓటరు విద్య ఎన్నికల భాగస్వామి కార్యక్రమం స్వీప్ ప్రారంభించామని జిల్లా ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సమగ్ర శిక్ష కోనసీమ జిల్లా ఎ.మధుసూదనరావు తెలిపారు. స్థానిక పాఠశాలలో స్వీప్ కార్యక్రమాన్ని టీచర్లతో నిర్వహించారు. మధుసూదనరావు మాట్లాడుతూ స్వీప్ చేపట్టిన తరువాత మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ప్రజాస్వామ్య నిర్మాణానికి ఓటు హక్కు చాలా విలువైందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఓటును వినియోగించుకోవాలన్నారు. జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బొరుసు సుబ్రహ్మణ్యం, ఎంఈవో కె.లీలావతి, హెచ్ఎం అల్లూరి గోపాలరాజులు పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో..



పెదపళ్లలో మంచుతో కప్పేసిన వరిచేను



మండపేట–ఆలమూరు రోడ్డులో మంచు ప్రభావానికి ఫ్లడ్‌లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్న కారు



గుమ్మిలేరులో మంచుతో కప్పబడిన సూర్యుడు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రధాన రహదారులు, లంక పరీవాహక ప్రాంతాలన్నీ బుధవారం ఉదయం మంచుతో తడిసి ముద్దయ్యాయి. పగలు మండు టెండలు, రాత్రి వేళల్లో ఉక్కపోత ఉంటుండగా తెల్లవారుజాము నుంచి మాత్రం మంచు తీవ్రంగా కురుస్తూ జనజీవనానికి తీవ్ర ఆటంకాన్ని కలిగించే విచిత్ర పరిస్థితి నెలకొంది. దట్టమైన మంచుతో సంతరించుకున్న కొత్త అందాలతో వివిధ ప్రదేశాలు కనువిందు చేశాయి. తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా కురుస్తున్న మంచు వల్ల ఉదయం ఎనిమిది గంటల వరకూ మంచు పొరలు వీడలేదు. ఒక దశలో మంచు విపరీతంగా కురియడంతో ఒకరి కొకరు కనబడనంతగా కమ్మేసింది. రోజు మాదిరిగా దైనందిన కార్యక్రమాలకు వెళ్లవలసిన వారంతా వేచి చూడక తప్పని పరిస్థితి ఏర్పడింది. వేసవిలో సైతం సూర్యుడు కనిపించనంతంగా ఈ మంచు దట్టంగా కురవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మండలంలోని లంక గ్రామాల్లో ఈ మంచు కురుస్తున్న దృశ్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అయితే ఆలమూరు–మండపేట రోడ్డులో మంచు దుప్పటి తీవ్రంగా కమ్ముకోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వేగంగా దూసుకెళ్లే వాహనాలన్నీ లైట్లు వేసుకుంటూ 20–30 కి.మీ వేగానికే పరిమితమవడం విశేషం.

కార్యకర్తల కృషితో విజయం ఖాయం



సోంపల్లి గ్రామశాఖ సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి

రాజోలు: గ్రామాల్లో పార్టీ కార్యకర్తల కృషితో విజయం ఖాయమని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. బుధవారం సోంపల్లిలో గ్రామశాఖ అధ్యక్షుడు కొంబత్తుల బాలయోగి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గొల్లపల్లి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గొల్లపల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్ మోహన్‌రెడ్డిని విజయపథంలో నిలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అన్ని సామాజిక వర్గాలకు రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచారన్నారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో పరిపాలన వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. వలంటీరు, గ్రామ సచివాలయం, రైతు భరోసా, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ వంటి వ్యవస్థలతో కొత్త పరిపాలనకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ సర్పంచ్, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి తెన్నేటి కిషోర్, పార్టీ నాయకులు బండారు కాశీ, మట్టా ఏడుకొండలు, బొమ్మిడి వెంకటేష్, తిరుమాని రాజు, బుంగ జ్యోతి, చింతా కొండాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభంజనం సృష్టించడం ఖాయం

సఖినేటిపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో మరో సారి వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని ఆ పార్టీ రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. బుధవారం మోరి సూర్యనారాయణ పేటలో యూత్ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. పేదలకు న్యాయం చేసే విధంగా ప్రతి విషయంలో ఎంతో నిబద్ధతతో, నిజాయితీతో పాలన చేసిన సీఎం జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రి చేసుకోవాలని సూచించారు. వెంట పార్టీ నాయకుడు నల్లి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ తిప్పలు తప్పడం లేదు

- పింఛను కోసం అవ్వా తాతల ఎదురుచూపులు
- టీడీపీ ఫిర్యాదుతో వలంటీర్లను నిలిపివేసిన ఎన్నికల కమిషన్



వలంటీర్లను రాళ్లతో కొడుతున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కార్టూన్ చిత్రం

కొత్తపేట: ఒకటో తారీఖున పొద్దు పొద్దునే వలంటీర్ పింఛను తెచ్చి ఇచ్చేటోడు. రాలేదు.. రెండో తారీఖు వచ్చిందీ.. తేలేదు. అని ఓ వృద్ధుడు.. తెల్లారకుండానే వలంటీరమ్మాయి లేపి మరీ పింఛను డబ్బులు చేతిలో పెట్టేది.. నిన్న రాలేదు.. రెండో రోజు రాలేదేమిటో.. అని ఓ వృద్ధురాలు.. ఓ వితంతువు, ఓ దివ్యాంగుడు ఇలా పింఛనుదారులు ప్రతి నెలా మాదిరిగానే ఒకటో తేదీన లేదా రెండో తేదీన పింఛను కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసీ చూసీ ఎంతకీ రాకపోయే సరికి నిరాశా నిస్పృహలకు లోనయ్యారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ, గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి పేద, మధ్యతరగతి ప్రజలకు సేవ చేస్తుంటే గిట్టని వారు కుట్రలు చేసి వలంటీర్లను రాకుండా అడ్డుకున్నారని వృద్ధులు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు.

చాలా దారుణం



వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ నిలిపివేయడం దారుణం. గత టీడీపీ ప్రభుత్వంలో పంచాయతీకి వెళ్లి పింఛను డబ్బులు తెచ్చుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పుణ్యమా అని పంచాయతీ వద్ద పడిగాపులు పడకుండా వలంటీర్ల ద్వారా ఇంటికే పంపించే ఏర్పాటు చేశారు. టీడీపీ వారు రాజకీయం చేయడం, మమ్మల్ని ఇబ్బందులు పెట్టడం ఎంతవరకూ సబబు.

– ఈరి చిన్న, పింఛన్ లబ్ధిదారు, గంటి పల్లిపాలెం

వలంటీర్లపై చంద్రబాబుకు కోపమెందుకు?



చంద్రబాబుకు వలంటీర్లపై కోపం ఎందుకు? మాకు ఒకటో తారీఖున పింఛను ఇంటికి తెచ్చి ఇస్తుంటే వారిని మా ఇళ్లకు రాకుండా అడ్డుకున్నారు. అసలే ఎండలు మండుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో పరిస్థితులు తలెత్తాయి. ఈ రోజుల్లో వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాలకు వెళ్లి పడిగాపులు పడి పింఛను తీసుకోవడం వ్యయప్రయాసలు పడాల్సిన పరిస్థితి.

– పొలింగి దానియేలు, దివ్యాంగ పింఛనుదారు, కొత్తపేట

లొల్లలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

రాయవరం: విశ్వ మానవతా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని లొల్ల గ్రామంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య కేంద్రం నుంచి వచ్చిన సాంకేతిక వైద్య నిపుణులు సుబ్రహ్మణ్యం, సురేంద్ర, కొండలరావు, విజయ సునందలు రోగులకు వైద్య సేవలు అందించారు. లొల్ల పరిసర గ్రామాలకు చెందిన 95 మంది వైద్య సేవలు పొందారు. 25 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, విశ్వ మానవత సంస్థ ప్రతినిధి కర్రి సుజాత, స్థానికులు పాల్గొన్నారు.